క్లుప్తంగా

జపాన్‌లో ప్రదర్శనలకు శ్రీకాంత్ బృందం



శిష్య బృందంతో శ్రీకాంత్

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు పాత్రుని శ్రీకాంత్ శిష్యబృందంతో కలిసి విదేశాలలో ప్రదర్శన ఇవ్వడానికి బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున విదేశాలలో భారతీయ సంస్కృతి వైభవాలు చాటి చెప్పేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో జపాన్‌కు ప్రయాణమయ్యారు. 10 రోజుల పాటు టోక్యో, కాన్సై, ఒసాకా ప్రాంతాలలో కూచిపూడి ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈ బృందంలో రామకౌండిన్య, నేహా, వర్షిత, నేహా థామస్, లలిత, చాందిని ఉన్నారు.

మహానందీశ్వరునికి అభిషేకాలు



నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో వృషభ త్రయోదశి సందర్భంగా మహానందీశ్వరునికి శనివారం అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖర శర్మల ఆధ్వర్యంలో ఏకకాలంలో ఉమారుద్రునికి, నందీశ్వరునికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం భాస్కరరావు

ఎచ్చెర్ల: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలని గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్రమశిక్షణ అనే అంశంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ముందుగా క్రమశిక్షణతో మెలగడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.


సుకుమారన్ సేవలు చిరస్మరణీయం



సుకుమారన్‌కు నివాళులు అర్పిస్తున్న ఇస్కాఫ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం పీఎన్ కాలనీ: భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) జాతీయ కార్యదర్శి సుకుమారన్ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. స్థానిక క్రాంతిభవన్‌లో జిల్లా ఇస్కాఫ్ ఆధ్వర్యంలో శనివారం సుకుమారన్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇస్కాఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి కృషి చేసిన అభ్యుదయ వాది సుకుమారన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు చిక్కాల గోవిందరావు, జిల్లా సమితి గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి, రౌతు శంకరరావు, జిల్లా కార్యదర్శి జి.వి. నాగభూషణరావు, చౌదరి సత్యనారాయణ, ఎస్.చిన్నారావు, కె.భాస్కరరావు, అన్నెపు జోగినాయుడు, ఎస్.నవచైతన్య, వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఎండలో ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ అన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో శనివారం శ్రీకాకుళం రెండో డిపో కండక్టర్ డి.లక్ష్మి సౌజన్యంతో ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణాలు చేసేటప్పుడు మంచినీరు, చల్లని పానీయాలు వెంట తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎం.పి.రావు, ప్రసాదరావు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు

ప్రకృతి సాగు.. లాభాలు బాగు



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎరువులు తయారుచేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుండటంతో సహజ సిద్ధమైన పద్ధతుల్లో సేద్యం చేసేందుకు అన్నదాతలు ముందుకు వస్తున్నారు. దీంతో ఏటా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. సాధారణంగా పొలాల్లో పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంటుంది. ఈ క్రమంలో పంటల దిగుబడి ఆశించినంతగా రావడం లేదు. అదే ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో ఆరోగ్యవంతమైన ఫలసాయం అధికంగా వస్తుంది. ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో ప్రకృతి సాగు అవలంబించేందుకే రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఎంపిక చేసిన గ్రామాల్లో..

ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులను సాగు విధానాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. సాగులో మెలకువలను వివరిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మండలాల్లో క్లస్టర్లుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను పండిస్తున్నారు. ఎచ్చెర్ల మండలంలో కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎం పురం, ధర్మవరం, కొంగరాం తదితర గ్రామాల్లో ఈ పంటలను పండిస్తున్నారు.

భూసారం కాపాడే ఎరువులు..

ప్రకృతి వ్యవసాయంలో భూసారం కాపాడే ఎరువులను మాత్రమే వినియోగిస్తారు. ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారుచేసిన ఎరువులు, క్రిమిసంహారక కషాయాలను వినియోగిస్తుంటారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండటంతో వీటిపై దృష్టి సారిస్తున్నారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణ, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవు పేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. వీటికి నీటిని కలిపి తయారుచేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకతి వ్యవసాయం నిర్వాహకులు ఏర్పాటుచేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.



ప్రోత్సహించాలి



ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయన్ని ప్రోత్సహించాలి. సాగుకు అవసరమైన పరికరాలు, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందివ్వాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. రైతులు కూడా క్రమక్రమంగా ప్రకృతి సేద్యానికి ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేస్తే మరిన్ని సత్ఫలితాలు ఉంటాయి.

– శ్రీనివాసరావు, రైతు, కొంగరాం

సాగు విస్తీర్ణం పెరిగింది..



ప్రకృతి వ్యవసాయ సాగు చేసే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. కొందరు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగటం వల్ల గతేడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీపీ, ప్రకృతి వ్యవసాయం

ప్రకృతి సాగుకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆ దిశగా ప్రోత్సాహక చర్యలేవీ ఉండటం లేదని, సర్కారు మరింత ప్రోత్సహిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

● వైభవంగా సీతారాముల కల్యాణం



సీపన్నాయుడుపేటలో శ్రీరామ మందిరం వార్షికోత్సవం సందర్భంగా శనివారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ నేతృత్వంలో అర్చకులు బంకుపల్లి అప్పల నరసింహశర్మ, సుధీర్ శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

● తులసిమాల అలంకరణ



నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది.

– శ్రీకాకుళం కల్చరల్

● వెంకన్నకు విశేష పూజలు



ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరు పొందిన నారాయణ తిరుమలలో వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. శ్రీవేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

గ్రంథాలయాలతో విద్యాభివృద్ధి



పుస్తకాలను చదువుతున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని లైబ్రేరియన్ పి.ఉగ్రసేన అన్నారు. బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బలగ మున్సిపల్ హైస్కూల్ బయోలాజికల్ సైన్స్ టీచర్ బి.వి.అప్పలనాయుడు హాజరై పుస్తకాల ఆవశ్యకతను వివరించారు. పలు పుస్తకాలను పిల్లలకు పరిచయం చేశారు. అనంతరం వరం స్కూల్ తెలుగు పండిట్ ఉప్పు త్రినాథరావు పిల్లలకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఈశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బోనెల ఈశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొందుతూ మరణించారు. అదే గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కోంద్రు త్రినాథరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరి కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు దన్నాన హరి, రెడ్డి వాసుదేవరావు, కలిశెట్టి కన్నంనాయుడు, చంటి, రామారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు సోదరుడు గోవిందరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులను ఇబ్రహీంబాద్‌లో విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నేతింటి నీలమప్పడు, జరుగుళ్ల శంకరరావు, కేవీవీ సత్యనారాయణ, మాదుగుల మురళీధర్‌బాబా పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కాంట్రాక్టర్లకు రావాల్సిన ముందస్తు డిపాజిట్ (ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ)లు ఏళ్ల తరబడి తిరిగి ఇవ్వకుండా అకౌంట్స్ విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నారని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘ నాయకులు శనివారం కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక, ఎం-బుక్‌లు రికార్డ్ చేయక ఏళ్ల తరబడి ఇంజినీరింగ్ విభాగంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. నామినేషన్, సి-బిల్లు పద్ధతి పనులను కాంట్రాక్టర్లందరికీ సర్దుబాటు చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొంతమందికే చెక్ పేమెంట్ ఇచ్చి మరికొందరికి అన్యాయం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం



గరిమెళ్ల విగ్రహం వద్ద సమావేశమైన సాహితీ సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పలు సాహితీ సంస్థల ప్రతినిధులు అన్నారు. కేంద్ర గ్రంథాలయంలోని గరిమెళ్ల విగ్రహం వద్ద శనివారం అన్ని సంస్థల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన కవితా నిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ రఫీ(ఈవేమన) మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తెలుగు భాష అమలు, వాడుక భాషలో తెలుగు భాష అభివృద్ధి కోసం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు, తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, తంగి యర్రమ్మ, కుదమ తిరుమలరావు, ఉమాకవి, బాడాన వెంకటరావు, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు బుర్రి కుమారరాజు పాల్గొన్నారు.

భక్తులకు తప్పని పాట్లు



అరసవల్లిలో యాత్రికులకు అవస్థలు తప్పడం లేదు. గతంలో ఆలయం వద్ద వసతి ఏర్పాట్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక భవనాలు కూల్చివేయడంతో భక్తులకు రహదారులే దిక్కయ్యాయి. రాత్రి సమయాల్లో వచ్చిన దూరప్రాంత భక్తులు ఇలా షాపుల బయటే నిద్రపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– అరసవల్లి

‘పన్ను’పోటుకు సిద్ధం!

- నగరవాసులపై ఆస్తిపన్ను భారం
- జూన్ 15 నాటికి ఇంటింటా కొలతలు
- ఆస్తి పన్ను 15 నుంచి 20 శాతం వరకు పెంచే అవకాశం



శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

శ్రీకాకుళం: నగర వాసులపై మరో రెండు నెలల్లో ఆస్తి పన్ను భారం పడనుంది. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఓ సర్క్యులర్ దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. వచ్చే నెల 15వ తేదీలోగా ఇంటింటా కొలతలు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. సర్వే పేరిట కొలతలు పూర్తి చేయాలని సర్క్యులర్ సారాంశంగా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం 15 శాతం ఆస్తి పన్ను చెల్లిస్తున్న ప్రజలు రీసర్వే పేరిట చేపట్టిన కొలతలు పూర్తయితే 20 శాతం వరకు పెంచిన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. సర్వే అని చెబుతున్నప్పటికీ సర్క్యులర్‌లో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటికీ పన్ను భారం అదనంగా పడనుంది. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోని చాలావరకు ఆస్తులకు అస్సెస్‌మెంట్లు లేవని, మరికొందరు ఒక అంతస్తు నిర్మాణానికి అనుమతి తీసుకుని రెండు, మూడు అంతస్తులు నిర్మించారని అధికారులు గుర్తించారు. ఇందుకోసమే సర్వే చేపడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అదనపు భారం మోపడమే దీని ఆశయంగా తెలుస్తోంది. సర్వే చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటింటా సర్వే...

వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటా సర్వే పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లు, రెవెన్యూ ఉద్యోగుల ద్వారా ఈ సర్వే పూర్తి చేయనున్నారు. ఇళ్లు, భవనాలకు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారా? లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తారు. ఖాళీ స్థలాల పన్నులపైనా సర్వే చేపట్టనున్నారు. నిర్మాణం జరిగిన విస్తీర్ణం మేరకు పన్ను చెల్లింపులపైన, అదనపు అంతస్తులు నిర్మాణం పైన, నివాస భవనాలు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారా.. తదితర అంశాలపై సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వే ఆధారంగా పన్నులు వసూలు చేస్తారు. సర్వే పూర్తయితే నగరంలో 90 శాతం మందిపై అదనపు భారం పడుతుంది.

ఇదేనా సంపద సృష్టి..

కూటమి నాయకులు ఎన్నికల ముందు సంపద సృష్టించి సంక్షేమ, అభివృద్ధి పనులు చేపడతామని నమ్మబలికారు. ప్రజలపై అదనపు భారం మోపడమేనా సంపద సృష్టి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆసరా వంటి పథకాలను గాలికి వదిలేసి పింఛన్లు, రేషన్ కార్డుల్లో కోత విధించి పేదలను నష్టపెడుతూనే.. తాజాగా సామాన్య, మధ్యతరగతి ప్రజలపై రకరకాల పద్ధతుల్లో అదనపు భారం విధిస్తున్నారు. ఇలాంటి నిర్ణయాలపై పునరాలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్క్యులర్ వాస్తవమే..



మున్సిపాల్టీ ఆస్తులపైన, వసూలు చేస్తున్న పన్నులపైనా సర్వే చేయాలని సర్క్యులర్ రావటం నిజమే. పన్నులు పెంచటం దీని ఉద్దేశం కాదు. పన్నుల పరిధిలోకి రానివారిని గుర్తించి వారి నుంచి పన్నులు వసూలు చేయటం దీని సారాంశం. చాలా మంది ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించటం లేదు. దీనిపై దృష్టి సారిస్తాం.

– ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం

వలసల నివారణకే ‘ఉపాధి’

ఎచ్చెర్ల: వలసలు నివారించి గ్రామాల్లోనే ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు ఇజ్జురోతు రమణ అన్నారు. శనివారం లావేరు మండలం లోపెంట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. ఉపాధి వేతనాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పెద్దలు కోరారని, త్వరలోనే వేతనాలు పెరుగుతాయని చెప్పారు. ఈయనతో పాటు లావేరు మండల ఉపాధ్యక్షులు సీతారెడ్డి ఉన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



తాము గీసిన చిత్రాలతో చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు చదువుతోపాటు వినోదం అవసరమని విశ్రాంత ఉపాధ్యాయుడు బి.ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ఇక్కడకు చిన్నారులు వస్తే క్రమశిక్షణ, ఉన్నత విలువలు అలవడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బొబ్బిలివీధిలో తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న అధికారులు

జి.సిగడాం: గ్రామాల్లో దాహం కేకలు లేకుండా సకాలంలో తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని రూరల్ డెవలప్‌మెంట్ డీఈఈ దుర్యోధనరావు, ఏఈఈ యు.కుసుమ అన్నారు. శనివారం ఆనందపురం, జి.సిగడాం గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 720 బోర్లు ఉన్నాయని, వాటిలో ఏవైనా మొరాయిస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందిస్తే 24 గంటల్లో తాగునీరు అందిస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని బొబ్బిలి కాలనీ ప్రజలకు తాగునీరు అందేంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్‌సాహు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి, ముద్దాడ గౌరీ, మజ్జి రమణ పాల్గొన్నారు.